

- విరేచనాలు కావడంతో నలుగురికి సీహెచ్‌సీలో చికిత్స
- హాస్టల్‌ను సందర్శించిన ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి

దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

# గిరిజన గురుకులంలో విద్యార్థులకు అస్వస్థత

**స్టూడెంట్స్‌ను పరామర్శించిన మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్**

గూడూరు, ఫిబ్రవరి7: మండలంలోని దామరవంచ గిరిజన గురుకుల పాఠశాలలో 16 మంది విద్యార్థులు విరేచనాలతో అస్వస్థతకు గురికాగా, నలుగురు స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.. గురువారం సాయంత్రం స్నాక్స్‌గా బొబ్బర గుగ్గిల్లు, రాత్రి కూర, సాంబార్‌తో అన్నం తిని పడుకున్నారు. సాయిప్రసాద్(9వ తరగతి), లకావత్ రాహుల్, బానోత్ అనిల్, బానోత్ యాకూబ్‌కు విరేచనాలు కావడంతో తెలుగు టీచర్ గమనించి శుక్రవారం ఉదయం దవాఖానకు తరలించారు. వెంటనే వైద్యుడు వీరికి చికిత్స అందించడంలో ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి శ్రీనివాసరావు ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఆరోగ్యంగానే ఉన్నారని, నలుగురికి మాత్రమే విరేచనాలు అవుతున్నాయని, కారణం తెలుసుకుంటామని తెలిపారు. దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎమ్మెల్యే మురళీనాయక్, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పరామర్శించారు. వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

## మెనూ ప్రకారం ఆహారం అందించాలి: ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి



వంటగదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

గూడూరు, ఫిబ్రవరి7: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, అన్ని వసతులు కల్పించాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. దామరవంచ గురుకుల పాఠశాలను సందర్శించి, వంటగది, ఆహార పదార్థాలు, సామగ్రి, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బంది, ఉద్యోగులు, విద్యార్థులతో మాట్లాడుతూ వంటగదిలో శుభ్రత పాటించాలని, విద్యార్థులకు సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు. నాయకులు దేవేంద్రాచారి, మంగీలాల్, రామన్ననాయక్ పాల్గొన్నారు.

## విద్యార్థుల చావులన్నీ ప్రభుత్వ హత్యలే

మాలోత్ కవిత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు



దవాఖానలో విద్యార్థులతో మాట్లాడుతున్న కవిత

కాంగ్రెస్ 14నెలల పాలనలో సంక్షేమ హాస్టల్‌లో 50 మందికి పైగా విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోయారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలే. విద్యార్థులకు ఉడికీ ఉడకని పుచ్చులు కలిగిన స్నాక్స్ గుగ్గిల్లు(గుడాలు) ఇచ్చారు. ఇది సర్కారు నిర్లక్ష్యమే. నాణ్యత లేని ఆహారం కారణంగా విద్యార్థులు ప్రాణాలమీదికి తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు, నాణ్యమైన ఆహారం సమకూర్చాలి. ప్రభుత్వ అధికారులతో పాటు మంత్రులు శ్రద్ధ తీసుకుని హాస్టల్ బాటపట్టాలి.

## ప్రభుత్వం ఉన్నదా..లేదా : మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్



విద్యార్థులను పరామర్శిస్తున్న శంకర్‌నాయక్

ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నదా, పాలన జరుగుతున్నదా?. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ఏ వర్గం కూడా సంతోషంగా లేరు. కేవలం కేసీఆర్ కుటుంబాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. ఇప్పటికైనా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు, విద్యార్థుల సంక్షేమం, విద్య, వైద్యం కోసం ప్రభుత్వం చొరవ చూపాలి. లేకుంటే ఆందోళనలు చేస్తాం. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బీరవెళ్లి భరత్‌కుమార్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్, నాయకులు బోడ కిషన్, రహీం, బెజ్జం రమేశ్, నర్సింహానాయక్, మన్మోహన్‌రెడ్డి, చందర్ పాల్గొన్నారు.

# డీటీసీ ఇంట్లో ఏసీబీ సోదాలు



పలివేల్పులలో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు, మధ్యలో డీటీసీ శ్రీనివాస్

- హనుమకొండతో పాటు హైదరాబాద్, కరీంనగర్, జగిత్యాలలో దాడులు
- ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు గుర్తించిన అధికారులు

సుబేదారి,ఫిబ్రవరి07: హనుమకొండ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడనే పక్కా సమాచారంతో శుక్రవారం భీమారం పలివేల్పుల లోని ఆయన నివాసంలో ఏసీబీ అధికారులు సోదా చేశారు. వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ఒకేసారి ఆయన ఇంటితో పాటు హైదరాబాద్, కరీంనగర్, జగిత్యాలలోని బంధువుల నివాసాల్లో నాలుగు బృందాలు తనిఖీలు చేపట్టాయి. శ్రీనివాస్ నివాసంలో బ్యాంకు పాస్‌బుక్‌లు, ల్యాండ్ పేపర్స్, గోల్డ్, ఇతర విలువైన వస్తువులను పరిశీలించారు. రాత్రి వరకు సోదాలు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నాలుగు చోట్ల నిర్వహించిన సోదాల్లో డీటీసీకి ఉన్న మొత్తం ఆస్తుల వివరాలను ఏసీబీ డీఎస్పీ సాంబయ్య వెల్లడించారు.




కళాకారులతో కలిసి త్యాగరాజ కీర్తన ఆలపిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



# కళాకారులతో కలిసి కీర్తనలు ఆలపించి..

**సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య**

హనుమకొండ, ఫిబ్రవరి 7: విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవాల్లో కళాకారులతో కలిసి కలెక్టర్ ప్రావీణ్య త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్ర ఆడిటోరియంలో సంగీత, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించగా, కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ వేడుకల్లో హైదరాబాద్ నుంచి వచ్చిన కళాకారులతో పాటు స్థానిక కళాకారులు, కళాశాల అధ్యాపక బృందంతో కలిసి కలెక్టర్ కీర్తనలు పాడారు. కళాకారులు, చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. సుధీర్ కుమార్, అధ్యాపకులు భాస్కర్, అనుముల యోషా , హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓని విజయ్, కళాకారులు, సంగీత ప్రియులు తదితరులు పాల్గొన్నారు.

## అరవింద్ కుటుంబానికి కేటీఆర్ భరోసా


**ఎక్స్ వేదికగా స్పందించి రూ.50వేల సాయం**



కేటీఆర్ పంపిన రూ.50వేలను అరవింద్ కుటుంబ సభ్యులకు అందిస్తున్న నన్నపునేని నరేందర్

వరంగల్, ఫిబ్రవరి 7 : రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పరకాలకు చెందిన అరవింద్ కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. గురువారం కేసముద్రం సమీపంలో శాతవాహన ఎక్స్‌ప్రెస్ నుంచి జారి పడడంతో అరవింద్ రెండు కాళ్లు విరుగగా అతడి ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులు ఎక్స్ వేదిక ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన రామన్న.. వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ద్వారా అరవింద్ పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం నగరంలోని గార్డియన్ హాస్పిటల్‌లో అరవింద్‌ను మాజీ ఎమ్మెల్యే నరేందర్ పరామర్శించి కేటీఆర్ పంపిన రూ.50వేలను అతడి కుటుంబసభ్యులకు అందజేశారు. అరవింద్ పరిస్థితిని వివరించిన వెంటనే స్పందించి ఆర్థిక సహాయం చేసిన కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

- రిజర్వేషన్ల పేరిట ప్రభుత్వం మోసం చేసిందని మండిపాటు
- పదేళ్ల తర్వాత బలహీన వర్గాల జనాభా ఎలా తగ్గుతది?
- చిత్తశుద్ధి నిరూపించుకోకపోతే గాలిలో కొట్టుకుపోతది
- కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరుగుతున్న బీసీ సంఘాలు



‘బీసీ రిజర్వేషన్ల విషయంలో దగా చేస్తే తడాఖా చూపిస్తాం.. పదేండ్ల క్రితం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో బలహీన వర్గాలు 52% అని తేలితే, ఇప్పుడు 46% ఎలా అయితరు?.. 21 లక్షలు తగ్గించి చూపి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. అగ్రవర్ణాల రిజర్వేషన్లను కాపాడేందుకే బీసీల సంఖ్యను తగ్గించి చూపించారు. లెక్కల తేడాలో ఉన్న అనుమానాలను సర్కారు నివృత్తి చేయకుండా మొండి వాదనకు దిగుతున్నది. కుల గణన ఆధారంగానే సంక్షేమ పథకాలు అమలు చేస్తాం.. నిర్ణయాలు తీసుకుంటామని ప్రభుత్వ పెద్దలు చెప్పడాన్ని బీసీలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ సర్వేతో వారికి మరింత అన్యాయం జరుగుతుంది. ఈ విషయంపై రాహుల్ గాంధీకి లేఖ రాస్తాం. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి. బీసీ డిక్లరేషన్ మేరకు సమగ్ర కులగణన వివరాలను వెల్లడించి రాష్ట్రప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. లేదంటే బీసీల ఉద్యమంతో గాలికి కొట్టు కుపోతది’ అని వివిధ బీసీ, వివిధ కుల సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

- నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 7

### బీసీలను మోసం చేసిన కాంగ్రెస్



జనగామ చౌరస్తా : కుల గణన సర్వే పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసింది. సర్వే పూర్తికాకుండానే బీసీల సంఖ్యను ప్రకటించింది. అందులోని 134 కులాల్లో ఏ కులం వారు ఎంత జనాభా ఉన్నారనే లెక్కలు చెప్పలేదు. గత సీఎం కేసీఆర్ ఒక్కరోజులో చేసిన సర్వేలో బీసీల సంఖ్య పెరిగింది. కానీ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చేయించిన సర్వేలో బీసీల సంఖ్య లక్షల్లో తగ్గిందని స్పష్టంగా అర్థమవుతున్నది. ఈ లెక్కల తేడాతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు అనుమానం కలుగుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి.

– ఏనుగుతల యాదగిరి, కుమ్మర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జనగామ

**తప్పుడు గణనపై బీసీల సమరం**

# దగా చేస్తే తడాఖా చూపిస్తాం

### ఇదే సామాజిక న్యాయమా?



హనుమకొండ: బీసీలకు అన్యాయం చేయడమే సామాజిక న్యాయమా? కుల గణనతో కాంగ్రెస్ ప్రభుత్వం బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నది. 2015లో రాష్ట్రంలో బీసీలు 51.1 శాతంగా ఉంటే, ఇప్పుడు 46.25 శాతమని లెక్కలు చెబుతున్నరు. అప్పుడు బీసీలు 1.88 కోట్లుగా ఉంటే ప్రస్తుత సర్వేలో 1.64 కోట్లుగా చూపిస్తున్నారు. పదేళ్ల తర్వాత జనాభా ఎందుకు తగ్గింది అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3.51 కోట్లుగా ఉంటే, ప్రతి సంవత్సరం1.3 శాతం జనాభా పెరిగితే 4.20 కోట్లకు చేరుకుంటుంది. కానీ కుల గణన రిపోర్టులో 3.54 కోట్లుగా చూపించడం అంటే 60 నుంచి 70 లక్షల జనాభా సర్వే పరిధిలోకి రాలేదు. కేంద్ర ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం రాష్ట్రంలో 3.35 కోట్ల ఓటర్లు ఉంటే కుల గణన రిపోర్టు ప్రకారం జనాభా 3.54 కోట్లుగా చూపిస్తున్నారంటే ఓటర్లుగా నమోదు కాని వారు రాష్ట్రంలో కేవలం 19 లక్షలే ఉన్నారా?, అందుకే సర్వే రిపోర్ట్ అశాస్త్రీయంగా ఉందనే భావన వ్యక్తమవుతున్నది. అగ్రవర్ణాల్లో ఒక సామాజిక వర్గం జనాభాని 17 లక్షలుగా చూపించారనే ఆరోపణలు ఉన్నాయి. కులగణన రిపోర్టులో బీసీలకు జరిగిన అన్యాయంపై రాహుల్ గాంధీకి లేఖ రాస్తాం.

– డాక్టర్ తిరుణహరి శేషు, బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్

### కుల గణనలో శాస్త్రీయత లేదు



కాజీపేట: కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన కుల గణన సర్వేలో శాస్త్రీయత లేదు. పదేండ్ల క్రితం జరిపిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీలు 52% అని తేలగా, ఇప్పుడు 46%కు ఎట్లా తగ్గుతారో చెప్పాలి. సర్వేలో అవకతవకలు జరిగాయి. బీసీలను అన్ని విధాలా అణగ దొక్కేందుకు కావాలనే తప్పుడు రిపోర్టు ఇచ్చారు. బీసీ జనాభాను 21 లక్షలు తగ్గించి చూపడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టుకాక తప్పదు. 2014లో ఓసీల జనాభా 8% ఉంటే, ప్రస్తుతం 15% ఎలా పెరుగుతుంది. వారు పెరిగినప్పుడు బీసీలు ఎందుకు పెరుగలేదో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. బీసీలకు న్యాయం చేయాలనే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డికి లేదు. కేవలం కుల గణన చేసినట్లు చేతులు దులుపేసుకునేందుకు ప్రభుత్వం తప్పుడు సర్వే చేయించింది.

– మేకల కేదారి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు

### కాంగ్రెస్ బీసీల వ్యతిరేకి



ఖిలావరంగల్: కాంగ్రెస్ పార్టీ నాయకులు నాటి నుంచి బీసీలకు వ్యతిరేకంగా ఉన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఒకరికొకరికి సంబంధం లేకుండా మాట్లాడుతూ బీసీలను అవమానిస్తున్నారు. అంబేద్కర్, బీపీ మండల్ త్యాగ ఫలితంగా రిజర్వేషన్లు అనుభవిస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ బహుజన ఉద్యోగ, ఉపాధ్యాయులు అందరు ఏకమై పోరాటాలు చేయాలి. తెలంగాణ ఉద్యమం తరహాలో మరోసారి బీసీలు తమ గళం విప్పాలి.

–కేడల ప్రసాద్, పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు

# రైతుల కోసం నేనున్నానని..

**కష్టం తెలుసుకొని కదిలివచ్చిన ఎర్రబెల్లి**

- ఫోన్‌లో ఆవేదన చెప్పకొన్న కర్కాల కర్షకులు
- స్పందించి బయ్యన్న వాగు, ఎండిన పొలాలను పరిశీలించిన మాజీ మంత్రి
- రైతులకు అండగా ఉంటానని దయాకర్‌రావు భరోసా
- స్థానిక ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని ఫైర్
- సాగునీరు విడుదల చేయాలని అధికారులకు విజ్ఞప్తి



ఎర్రబెల్లి దయాకర్‌రావుకు తమ గోడును విన్నవించుకుని విలపిస్తున్న రైతు వీర సోమయ్య

తొర్రూరు, ఫిబ్రవరి 7 : సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని.. నీటి కొరత తీవ్రంగా ఉన్నదంటూ ఫోన్లో గోడు వెల్లబోసుకున్న రైతులకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. ఆ సమయంలో వివాహ వేడుకల్లో ఉన్న ఆయన కర్షకుల పిలుపునకు తక్షణమే స్పందించి తొర్రూరు మండలం కర్కాలలోని పాలేరు(బయ్యన్న) వాగుతో పాటు ఎండిపోయిన పొలాలను శుక్రవారం పరిశీలించారు. రైతుల గోస విన్న ఎర్రబెల్లి.. వెంటనే ఇరిగేషన్ సీఈ, ఎస్ఈలతో ఫోన్‌లో మాట్లాడి కర్కాల రైతుల పరిస్థితిని వివరించారు. ఎస్సారెస్పీ డీబీఎం-60 నుంచి నీటిని విడుదల చేసి రైతులకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. రెండు రోజుల్లో నీరు విడుదల చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ పాలేరు వాగు నీళ్లను డీబీఎం-60 కాల్వ నుంచి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తరలించుకుపోతుంటే స్థానిక ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలవాల్సిన నాయకులు అందుబాటులో లేకుండా, రైతులను ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కాగా, తమ సమస్యను అర్థం చేసుకొని తక్షణమే స్పందించిన దయాకర్‌రావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సెగ్యాం కొమురెల్లి, మద్దెల వెంకన్న, నగునూరి కట్టమల్లు, అనుముల ఎల్లయ్య, అశోక్, కృష్ణ, మల్లారెడ్డి, మురళి, నాగ సైదులు, రామ్మూర్తి, వెంకన్న, లచ్చయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

### సారు మీరున్నప్పుడే మంచిగుండే..

– వీర సోమయ్య, కర్కాల రైతు

వయసు మీద పడుతున్నా పొలం పనుల్ని విడిచిపెట్టలేదు సారు. వ్యవసాయాన్నే నమ్ముకొని బతుకుతున్న. ఈసారి ఎంతో ఆశపడి నాలుగెకరాల్లో పంట వేశాను. విత్తనాలు కొనడానికి అప్పు చేశాను. ఎరువులు, పురుగు మందులు, ఇతర ఖర్చులతో అప్పు మరింత ఎక్కువైంది. కానీ, ఇప్పుడు పొలానికి నీళ్లు అందక ఎండిపోతున్నది. కనీసం నష్టాన్ని కూడా తిరిగి పొందే అవకాశం కనిపించడం లేదు. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి రాలేదు. దయన్న కాలంలో బయన్న వాగులో నీరు ఎప్పటికీ ఉండేది. ఇప్పుడు మా పంట ఎండిపోతున్నది. మా కండ్ల ముందే మొక్కలు మాడిపోతున్నాయి. చేతులారా వేసిన పంటను తీయాల్సిన పరిస్థితి వచ్చింది. ఒక వర్షం పడినా, లేక ప్రభుత్వం సహాయం చేసి నీళ్లు ఇచ్చినా పంట పండేది. కానీ, ఇవి రెండూ జరగలేదు. మేము ఓట్లు వేసిన వాళ్లు ఇప్పుడు కనిపించడం లేదు సారు.

# విద్యార్థులా.. వీధి రౌడీలా?

- యూనివర్సిటీలో కొట్టుకున్న విద్యార్థులు
- ఓ విద్యార్థి సంఘం నాయకుడి అండతో బయటి వ్యక్తులతో దాడి
- ఇరు వర్గాలపై కేసు నమోదు



యూనివర్సిటీలో కొట్టుకుంటున్న విద్యార్థులు

నయింనగర్, ఫిబ్రవరి 7 : హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు వీధి రౌడీల్లా ఒకరినొకరు కొట్టుకున్నారు. వివరాల్లో వెళితే.. ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సు చదివే మొదటి సంవత్సరం విద్యార్థులు, అదే కోర్సు చదివే రెండో సంవత్సరం వారికి మర్యాద ఇవ్వకపోవడం గొడవకు దారి తీసినట్లు తెలిసింది. శుక్రవారం ఉదయం సీనియర్లు, జూనియర్ల మధ్య మాటామాటా పెరిగి కొంత ఘర్షణ వాతావరణం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు కేయూ కు వెళ్లి మీరందరూ సాయంత్రం స్టేషన్‌కు రావాలని చెప్పి వెళ్లిపోయారు. మధ్యాహ్నం ఫస్టియర్ విద్యార్థులు ఓ విద్యార్థి సంఘం నాయకుడికి చెప్పడంతో సెకండియర్ విద్యార్థులు భోజనాలు చేస్తున్న క్రమంలో బయటి వ్యక్తులతో కలిసి మొత్తం 60 మందికిపైగా దాడి చేసి విచక్షణారహితంగా కొట్టినట్లు సమాచారం. రెండు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఐటీడీఏ అధికారులకు హైకోర్టు కోర్టు ధిక్కార నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ): ములుగు జిల్లా ఏటూరునాగారంలోని ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీరభద్రం, మరో ఇద్దరు అధికారులకు హైకోర్టు కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. మరణించిన ఉద్యోగి గ్రాట్యుటీ, పెన్షన్ ఇతర ప్రయోజనాలు బాధిత కుటుంబ సభ్యులకు చెల్లించాలంటూ 2024 ఏప్రిల్‌లో హైకోర్టు ఆదేశించింది. ఆ ఉత్తర్వులను అమలు చేయలేదంటూ జయలక్ష్మి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను జస్టిస్ మాధవీదేవి శుక్రవారం విచారించారు. కోర్టు ధిక్కరణ కింద చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పాలని వాళ్లను ఆదేశిస్తూ నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణ 21కి వాయిదా వేశారు.

## ముగ్గురు పిల్లల నిబంధన తొలగించకుంటే ఆమరణదీక్ష చేస్తా..

కొడకండ్ల, ఫిబ్రవరి 7: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధనలను తొలగించాలని, లేకుంటే ఆమరణ నిరహార దీక్ష చేపడుతానని బీఆర్ఎస్ నేత, జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ అభిమాన్ గాంధీనాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయనొక ప్రకటన చేశారు. తాను చేపట్టే దీక్షలో ఏ రాజకీయ పార్టీ జెండాలు ఉండవన్నారు.